నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి..
www.suryaa.com
EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
www.suryaa.com
4 PM
www.suryaa.com
శుక్రవారం
19 ఏప్రిల్ 2024
పేజీలు: 02



# ఓటేసిన ప్రపంచంలోనే అత్యంత పొట్టి మహిళ జ్యోతి ఆమ్గే

లోక్‌సభ తొలిదశ ఎన్నికల పోలింగ్ కొనసాగుతున్నది. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు బారులుతీరారు. సాధారణ పౌరులతోపాటు సినీనటులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు తమ ఓటుహక్కు వినియోగించుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రపంచంలోనే అత్యంత పొట్టి మహిళ జ్యోతి ఆమ్గే మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఓటేశారు. కుటుంబ సమేతంగా పోలింగ్ కేంద్రానికి వచ్చిన జ్యోతి.. అందరితోపాటు క్యూలైన్‌లో నిల్చుని ఓటు వేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఓటు వేయాలని, అది మన విధి అని విజ్ఞప్తి చేశారు. దేశ పౌరులుగా అది మన బాధ్యత అని చెప్పారు. తనతోపాటు తన కుటుంబ సభ్యులంతా ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. తాను చదువుకున్న స్కూల్‌లోనే ఓటు వేశానన్నారు.



# మాధవీ లత vs అసదుద్దీన్

తెలంగాణలో లోక్ సభ ఎన్నికల ప్రచారం తారెత్తిపోతోంది. అన్ని పార్టీల తీరు ఒక ఎత్తైతే.. మాధవీ లత, అసదుద్దీన్ ల తీరు మరో తీరులా కనిపిస్తోంది. హైదరాబాద్ నుంచి నాలుగు సార్లు ఎంపీగా గెలుస్తూ వస్తున్న ఎంఐఎం అధినేతను ఢీ కొట్టేందుకు బీజేపీ నుంచి మాధవీలత బరిలోదిగారు. తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మాధవీలత కామెంట్స్ చూసేముందు.. అసలు ఈ గొడవకు కారణమేంటో చూద్దాం.. ప్రచారంలో భాగంగా మాధవీలత చేసి చూపించిన ఓ చర్య ఇది. మతపరమైన కట్టడం మీదకు బాణం ఎక్కుపెడుతున్నట్లుగా చేశారు. దీనిపై అసద్ ఓ రేంజ్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాధవీలత తీరు ఎలక్షన్ కమిషన్, పోలీసులకి కనిపించదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు అసదుద్దీన్ ఒవైసీ. హైదరాబాద్‌లో శాంతికి విఘాతం కలిగించేలా ఆమె చర్యలున్నాయన్నారు ఎంఐఎం చీఫ్. ఈ నేపథ్యంలోనే మాధవీ లత ఎంఐఎం అధినేతకు కౌంటర్ ఇచ్చారు. అసదుద్దీన్ ముస్లింలను రెచ్చగొట్టాలని చూస్తున్నారన్నారు. ఎంఐఎం పతంగి చినిగిపోయే సమయం వచ్చిందని కీలక వ్యాఖ్యలు చేశారు. పాతబస్తీ అభివృద్ధి చెందడకూడదా అంటూ ప్రశ్నించారావిడ. ఇలా ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.




# ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ

## ఓటు వేసిన పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు..

దేశంలో తొలి విడత లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కొనసాగుతుంది. తొలి విడతలో 21 రాష్ట్రాల్లోని 102 స్థానాలకు పోలింగ్ జరుగుతోంది. అలాగే అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కొనసాగుతోంది. ఉదయం నుంచే పెద్ద ఎత్తున ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాలకు తరలివస్తున్నారు. పలువురు నేతలు ఇప్పటికే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సీఎం స్టాలిన్, తమిళనాడు సౌత్ లో తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై, సేలంలో పళనిస్వామి, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి పి చిదంబరం శివగంగ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. మాజీ ఆర్థిక మంత్రి పన్నీర్ సెల్వం, తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైతో పాటు పలువురు ప్రముఖులు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. సినీ రంగానికి చెందిన ప్రముఖులు కూడా ఓటు వేశారు. రజినీకాంత్, కుష్బూ, కార్తీక్, అజిత్, శివకార్తీకేయన్ ఉదయాన్నే వచ్చి తమ ఓటు వేశారు. పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది. సమస్యాత్మక ప్రాంతాల్లో ఓ గంట ముందుగానే పోలింగ్ ముగియనున్నట్లు తెలిపారు ఎన్నికల అధికారులు. గత ఎన్నికలకు ఈ ఎన్నికలకు చాలా తేడాలు ఉన్నాయి. ప్రస్తుతం తమిళనాడులో త్రిముఖపోరు నెలకొంది. డీఎంకే, ఏడీఎంకే, బీజేపీ కూటముల మధ్య హోరా హోరీ పోరు కొనసాగుతోంది. రాజస్తాన్‌లోనూ పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రక్రియను ప్రారంభించారు ఎన్నికల అధికారులు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు క్యూ లైన్లలో నిల్చున్నారు. రాజస్తాన్ సీఎం భజనలాల్ శర్మ తనకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక మధ్య ప్రదేశ్ లో కూడా లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ పర్వం కొనసాగుతోంది. మాజీ సీఎం కమల్‌నాథ్ ఓటు హక్కు వినియోగించుకోగా ఆయన కుమారుడు, కాంగ్రెస్ నేత నకుల్ నాథ్ చింద్వారా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. చింద్వారాలో పోలింగ్ కొనసాగుతోంది. తీవ్రమైన ఎండల నేపథ్యంలో ఉదయాన్నే వచ్చి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు ఓటర్లు. దీంతో మధ్యాహ్నం సమయానికే మంచి పోలింగ్ శాతం నెలకొనే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు.





# 23న పవన్ కళ్యాణ్ నామినేషన్

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో నామినేషన్ల పర్వం మొదలైంది. పిఠాపురం అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తోన్న పవన్ కళ్యాణ్ ఏప్రిల్ 23న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు జనసేన ట్విట్టర్ లో వెల్లడించింది. అదే రోజు సాయంత్రం ఉప్పాడలో నిర్వహించే బహిరంగసభలో ఆయన పాల్గొంటారని తెలిపింది. టీడీపీ అధినేత చంద్రబాబు తరపున ఆయన సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం మధ్యాహ్నం 1.27 గంటలకు కుప్పంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. గురువారం సాయంత్రమే ఆమె కుప్పం చేరుకున్నారు. శుక్రవారం ఉదయం 10.45 గంటలకు ఆమె వరదరాజస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలను ఉంచి పూజలు చేస్తారు. మరోవైపు టీడీపీ అధినేత చంద్రబాబు ఈ నెల 21న తమ పార్టీ అభ్యర్థులకు బీఫామ్‌లు అందజేయనున్నారు. 144 అసెంబ్లీ, 17 పార్లమెంట్ అభ్యర్థులకు స్వయంగా అందిస్తారు.



# భారత నావికాదళ చీఫ్‌గా దినేశ్ త్రిపాఠి

భారత తదుపరి నావికాదళాధిపతిగా వైస్ అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠిని కేంద్రం నియమించింది. ప్రస్తుతం వైస్ చీఫ్‌గా ఆయనను చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత నావికాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరి కుమార్ ఏప్రిల్ 30న పదవీ విరమణ చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది.



# కెన్యాలో హెలికాప్టర్ ప్రమాదం.. డిఫెన్స్ చీఫ్ మృతి

కెన్యాలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఆ దేశ డిఫెన్స్ చీఫ్ జనరల్ ఫ్రాన్సిస్ ఒమొండి ఒగోల్లా(61) మృతిచెందారు. ప్రమాద సమయంలో ఆయనతో పాటు మరో 11 మంది ఉన్నారని, ఇద్దరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారని అధికారులు తెలిపారు. నైరోబీ నుంచి 400 కి.మీ దూరంలోని మారుమూల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఘటనపై దేశాధ్యక్షుడు విలియం రూటో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కెన్యాలో గత 12 నెలల్లో 5 సైనిక హెలికాప్టర్లు కుప్పకూలడం గమనార్హం.



# తడిపొడి అందాలతో కవ్విస్తున్న కేతిక

హీరోగా నటించిన రొమాంటిక్ సినిమాతో టాలివుడ్ కు పరిచయం అయ్యింది ఈ అందాల భామ. తొలి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. రొమాంటిక్ సీన్స్ తో పాటు అందాలు ఆరబోస్తూ ఆడియన్స్ ను కవ్వించింది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది ఈ బ్యూటీ. నాగశౌర్య హీరోగా నటించిన లక్ష్య అనే సినిమా చేసింది. ఆ సినిమా కూడా నిరాశపరిచింది. ఆతర్వాత రంగ రంగ వైభవంగా అనే సినిమాలో నటించింది కానీ ఈ సినిమాలు సక్సెస్ కాలేకపోయాయి. ఆతర్వాత పవన్ కళ్యాణ్, సాయి దుర్గ తేజ్ చేసిన బ్రో సినిమాలో నటించింది. ఈ సినిమా హిట్ టాక్ తెచ్చుకున్నా కేతికాకు అనుకున్నంతగా గుర్తింపు రాలేదు. ఆ తర్వాత ఈ చిన్నది హీరోయిన్ గా ఆఫర్స్ అందుకోలేకపోయింది. ఇక సోషల్ మీడియాలో ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటుంది.



# ముందుగా నేనే ఓటేయాలనుకున్నా.. కానీ ఓటర్లను చూసి షాకయ్యా

## మేఘాలయా ముఖ్యమంత్రి కాన్రాడ్ కె సంగ్మా

దేశంలో సార్వత్రిక ఎన్నికలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. సాధారణ పౌరులతోపాటు ప్రముఖులు కూడా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు తరలివెళ్తున్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాకముందే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. మేఘాలయా ముఖ్యమంత్రి కాన్రాడ్ కె సంగ్మా సైతం లోక్‌సభ ఎన్నికల తొలి విడతలో ఓటు వేసేందుకు ఉదయం 6:30 గంటలకే తురాలోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. అయితే, ప్రజలు అప్పటికే క్యూలైన్‌లో ఉండటం చూసి ఆయన ఒక్కసారిగా షాక్ అయ్యారు. ముందుగా తాను ఓటు వేయాలని భావించినట్లు చెప్పారు. అయితే, తన కంటే ప్రజలే ముందు వెళ్లి క్యూలో నిలబడటం తనని ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. 'నేను ముందుగా ఓటు వేయాలని భావించి ఉదయం 6:30 గంటలకే పోలింగ్ కేంద్రానికి చేరుకున్నా. కానీ, నా కంటే ముందు చాలా మంది ఉండటం నన్ను ఆశ్చర్యపరిచింది. ఇది మంచి ధోరణి. ఓటు వేయడం ప్రతి పౌరుడి హక్కు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఓటు వేసి తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని ఆయన అన్నారు.

# ఓటు దేశభవిష్యత్తును నిర్ణయిస్తుంది

## కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ



దేశంలో సార్వత్రిక ఎన్నికలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. మొత్తం 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 102 స్థానాలకు ఇవాళ తొలి విడత పోలింగ్ జరుగుతోంది. దీంతో సాధారణ పౌరులతోపాటు ప్రముఖులు కూడా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు తరలివెళ్తున్నారు. ఈ సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ప్రతి ఓటూ దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# 22న ఇంటర్ ఫలితాలు

ఈ నెల 22వ తేదీన ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఒకేసారి వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. ఫలితాల వెల్లడిపై ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా తేదీని ప్రకటించనున్నట్టు బోర్డు కమిషనర్ శృతి ఓజా తెలిపారు. ఆది, లేదా సోమవారం ఫలితాలను వెల్లడించాలనుకుంటున్నామని, ఎక్కువ శాతం సోమవారమే ఉండొచ్చని ఆమె చెప్పారు. ఫలితాలకు సంబంధించి అన్ని దశల్లోనూ పరిశీలన పూర్తయిందని, ఎలాంటి లోటు పాట్లు లేవని భావించిన నేపథ్యంలోనే ఫలితాల వెల్లడికి రంగం సిద్ధం చేస్తున్నామని ఆమె తెలిపారు.

# ఇరాన్‌పై US, UK కొత్త ఆంక్షలు




ఇటీవల ఇజ్రాయెల్‌పై దాడి చేసిన ఇరాన్‌పై అమెరికా, బ్రిటన్ కొత్త ఆంక్షలు విధించాయి. ఈ దాడిలో ఇరాన్ వినియోగించిన డ్రోన్‌ల ఇంజిన్‌లను ఉత్పత్తి చేసే 16 మంది వ్యక్తులపై, రెండు సంస్థలపై అలాగే ఇరాన్ సైన్యానికి మద్దతు ఇచ్చిన ఐదు సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించింది. అటు బ్రిటన్.. డ్రోన్, బాలిస్టిక్ క్షిపణి తయారీలో సహకరించిన పలు సైనిక సంస్థలపై ఆంక్షలు విధించింది.

